ప్రజాశక్తి
మంగళవారం 31 జనవరి 2023
5

అల్లూరి సీతారామరాజు

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గ్రహణ మొర్రి వంటి సమస్యలున్న వికలాంగ బాలబాలికల కోసం ఫిబ్రవరి 1న బుధవారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద జిల్లాస్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష ఎక్స్అఫీషియో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, డిఇఒ డాక్టర్ పి.రమేష్, ఐఇ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కె.భాస్కరరావు సోమవారం ఉమ్మడి ప్రకటనలో తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, బసవతారకం స్మైల్ ట్రైన్ సెంటర్ (బిఎస్‌టిసి) డాక్టర్ డి.ముకుందరెడ్డి సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక వైద్యశిబిరాన్ని గ్రహణం మొర్రి బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాధితులకు ఉచిత శస్త్రచికిత్సలు, మందులను ఇవ్వనున్నట్లు తెలిపారు.

రిలే నిరాహార దీక్షల భగ్నం..

అక్రమ అరెస్టులపై ఆందోళన

నేడు నిరసనలు, 1న బంద్‌కు ప్రజా సంఘాల పిలుపు

అనంతగిరిలో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశ-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరు ఐటీడీఏ ఎదురుగా గత 43 రోజులుగా తాము నిర్వహిస్తున్న శాంతియుత రిలే నిరాహార దీక్షలను పోలీసులు భగ్నం చేయడం అప్రజాస్వామికమని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు కూడా రాధాకృష్ణ, ప్రభుదాస్, పాలికి లక్కు, పృథ్వీరాజ్, సుందర్‌రావు తదితరులు విమర్శించారు. అర్ధాంతరంగా రిలే దీక్షలను పోలీసులు భగ్నం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. గిరిజన విద్యార్థుల మరణాల పై సరైన కారణాలను వెల్లడించని అధికారులు సమస్యల పరిష్కారం చేయలేకనే దీక్షలు భగ్నం చేయించారని వారు ఆరోపించారు. ఈ సంద్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ, అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాల్ని ఆపలేరన్నారు. ఉద్యమాలను అణిచి వేయడంపై ఉన్న శ్రద్ధ గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు, గిరిజన సమస్యల పరిష్కారానికి చూపిస్తే బాగుండేదని సూచించారు. న్యాయబద్ధంగా, శాంతియుతంగా కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను ఎలా భగ్నం చేస్తారని, ప్రజాస్వామ్యంలో కనీసం నిరసన తెలుపుకునే అవకాశం కూడా లేకుండా చేయడం వైసీపీ ప్రభుత్వానికి తగదని మండిపడ్డారు. అక్రమ అరెస్టులు ఖండిస్తూ ఈనెల 31న అన్ని మండలాల్లో నిరసన, ఫిబ్రవరి 1న విద్యా సంస్థల బంద్‌కు సిద్ధపడాలని నాయకులు పిలుపునిచ్చారు.

విద్యార్థి మరణాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని విద్యార్థి మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని, గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గహంలో తక్షణమే హెల్త్ అసిస్టెంట్లు నియమించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని హెల్త్ వాలంటీర్లను నియమించేంతవరకు పోరాటమాగదని ఉద్యమ స్వరూపాన్ని మార్చి ఉప్పెనల ఉద్యమాన్ని ఉద్రిక్తం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా తహసీల్దార్ మతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థి మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఆశ్రమాలు హాస్టల్స్లో హెల్త్ అసిస్టెంట్ నియమించాలని ప్రజా సంఘాలను మీడియా ప్రతినిధులను మీడియా ప్రతినిధులను ఆశ్రమల్లో సందర్శించడానికి అనుమతిస్తూ ఇవ్వాలని తల్లితండ్రులను విద్యార్థులతో తో మాట్లాడడానికి అవకాశం కల్పించాలని, పలు సమస్యలపై ఐటీడీఏకు వెళ్లే గిరిజనులను , మరియు గిరిజన ఉద్యోగులను వేధిస్తున్న ఐటీడీఏ పీవో రోనంకి గోపాలకష్ణను ప్రభుత్వం సరెండర్ చేయాలని, అదేవిధంగా డిగ్రీ ఇంటర్ అడ్మిషన్ ట్యూషన్ ఫీజులు తక్షణమే ఐటీడీఏ చెల్లించాలని వారు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. .

అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రంలో 43 రోజులుగా నిరసన చేపడుతున్న ప్రజా సంఘాల నాయకులకు అక్రమ అరెస్టు చేయడం అన్యాయమని సోమవారం మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు ఎస్.నాగులు జె.సుబ్బారావు, రామకృష్ణలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలన్నారు. అరెస్టులతో పోరాటాలు ఆగవని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకురు. సర్పంచ్ కె.మొస్య, సిహెచ్. మురళి, జె.భీమన్న, ఎన్.చిన్న గంగులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: అక్రమ అరెస్టులపై గిరిజన సంఘం మండల కార్యదర్శి శ్రీను మాట్లాడుతూ, శాంతి యుతంగా దీక్షలు చేస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులను పోలీసులు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకే అరెస్టులు చేయడం సమంజసం కాదని మండిపడ్డారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. ఐటిడిఎ పిఒను సరెండర్ చేయాలన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, సిపిఎం మండల కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో మాట్లాడుతున్న నాయకులు

డుంబ్రిగూడ: ఐటీడీఏ ఎదుట చేపడుతున్న ప్రజా సంఘాల నాయకుల దీక్షను భగ్నం చేసి అరెస్టు చేయడాన్ని గిరిజన సంఘం తీవ్రగా ఖండిస్తుందని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సూర్యనారాయణ చెప్పారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ,గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో సుమారు 15 మంది విద్యార్థులు అనారోగ్యంతో మృతి చెందారని, వీటిని అధికారులు. ప్రభుత్వం అరికట్టాల్సింది పోయి కక్షపూరితంగా వ్యవహరిస్తూ అరెస్టు చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయ కులు పి.తిలక్, కె.నాయుడు, కె.రామదాసు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

నందిగామ వద్ద రోడ్డుపై బైఠాయించిన వరద బాధితులు

వరద సహాయం అందకపోవడంపై బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-ఎటపాక

వరద బాధితులకు నష్టపరిహారం అందకపోవడంపై బాధితులు సోమవారం మండలంలోని నందిగామ, గౌరిదేవిపేట సచివాలయాల పరిధిలోని ఆందోళన చేపట్టారు. నందిగామ సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టిన అనంతరం రోడ్డుపై బైఠాయించారు. వరద నష్టపరిహారం అందించడంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, అసలైన బాధితులకు నష్టపరిహారం అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వరద ముంపు గురైన గ్రామాల్లో ఇల్లు నష్టపోయిన, కూలిన బాధితులకు నష్టపరిహారం చెల్లించారంటూ, బాధితులు తమ బాంక్ అకౌంట్లు చేసుకోండి అంటూ శనివారం అధికార పార్టీ నేతలు, అధికారులు సోషల్ మీడియాలో ప్రచారాలు చేశారు. దీంతో వరద బాధితులు అకౌంట్లో చెక్ చేసుకోగా అసలైన వరద బాధితులకు నష్టపరిహారం అందలేదని, అధికార పార్టీ చెందిన నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే నష్టపరిహారం చెల్లించినట్లు గుర్తించారు. దీంతో వారు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలైలో వచ్చిన వరదలకు గ్రామం మొత్తం మునిగిపోయిందని పూర్తిగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.10వేలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.3200 పరిహారం అంటూ కొందరికే చెల్లించారని ఆరోపించారు. వారం రోజులు ఇళ్లను శుభ్రం చేసుకోడానికి సమయం పట్టిందని, 2నెలలు పనులు లేక పస్తులున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకుంటుందని ఎదురు చూశామని, కానీ అసలైన బాధితులకు పరిహారం అందలేదని, సచివాలయ సిబ్బంది వైసిపి నేతలకే పరిహారం అందేలా చేశారని విమర్శించారు.

వరద బాధితులందరికీ నష్ట పరిహారం చెల్లించాలి : సీపీఎం

వరద బాధితులందరికీ న్యాయం చేయకుండా వైసిపి ప్రభుత్వం డ్రామాలాడుతుందని సిపిఎం మండల కార్యదర్శి ఐవి విమర్శించారు. కొందరికే నష్టపరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటుందని ఆరోపించారు. వరదలో మునిగిన ప్రతి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించే వరకు సిపిఎం బాధితుల పక్షాన పోరాడుతుందని ఆయన తెలిపారు.

తుమ్మల సచివాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, గ్రామస్తులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి- చింతూరు

మండలంలోని తుమ్మల గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం తుమ్మల సచివాలయం పరిధిలో ధర్నా నిర్వహించారు. దీనికి ముందు తుమ్మల గ్రామస్తులు స్థానిక అంగన్వాడీ కేంద్రం నుండి మంచి నీటి సమస్యను పరిష్కరించాలని, స్థానిక రోడ్లు నిర్మించాలని, మంచినీటి మోటర్లు రిపేర్ చేయించాలని నినాదాలు చేస్తూ సచివాలయానికి చేరుకున్నారు. ధర్నా అనంతరం పంచాయతీ కార్యదర్శి స్వాతంత్రరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. అధికారులతో చర్చించి రెండు వారాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మొట్టం రాజయ్య అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ మంచినీటి పైప్‌లైన్లలో నాచు వస్తుందని, చేతిపంపుల నీరు దుర్వాసన వస్తుందని తెలిపారు. బోరుబావులను మరమ్మతులు చేయాలని, వాటర్ ట్యాంక్ క్లీన్ చేయాలని కోరారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా సచివాలయం పరిష్కరిస్తుందని, వారం రోజుల్లో పరిష్కారం చేస్తామని ముఖ్యమంత్రి ప్రగల్భాలు పలికారని, కాని ఆచరణలో మాత్రం సమస్యలు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉన్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జల్ జీవన్ మిషన్ పనుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా, ఏ ఒక్క ఇంటికి పైప్ లైన్ వేయలేదని తెలిపారు. ఉన్న పైప్ లైన్‌లను కనెక్ట్ చేయకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రజాధనం కాంట్రాక్టర్ పాలవుతుంటే పాలకులు అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను తక్షణం పరిష్కరించాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ముర్రం రంగమ్మ, సోడే లెనిన్, ముట్టుమ్ రవికుమార్, సోడే రవి, సోడే పెద్దయ్య, మొట్టు కిష్టమ్మ, సంకురమ్మ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల పరిశీలన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలం లోని ఉర్లాకులపాడు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని స్థానిక ఎంపీడీవో కె బాపన్నదొర తెలిపారు. మండలం లోని మారేడుబాకు పంచాయతీ ఉర్లాకులపాడు గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 5000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం చెరుకుంపాలెం సచివాలయాన్ని తనిఖీ నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాజవొమ్మంగి సచివాలయం పరిధిలో రాజవొమ్మంగి బీసీ కాలనీలో ఇటీవల నిర్మించిన డ్రైనేజీని పరిశీలించి ప్రజల ఫిర్యాదు మేరకు డ్రైనేజీ సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాజువొమ్మంగి నూకాలమ్మ గుడి సమీపంలో ఉన్న సంత మార్కెట్లో చెత్తాచెదారం లేకుండా చూడాలని, డ్రైన్లు పూడికతీత పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావును ఆదేశించారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, చెరుకుంపాలెం సర్పంచ్ నాగేశ్వరరావు, లబ్బర్తి ఎంపిటీసీ జి పెద్దిరాజు, గ్రామస్తులు సిహెచ్ అప్పారావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ బాపన్నదొర

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గిరిజన సంఘ మండల అధ్యక్షులు, సిపిఎం మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు ఆధ్వర్యంలో గిరిజనులు సోమవారం బంజాడ గ్రామం వద్ద ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ, వెంకట పంచాయతీ పరిధి బంజోడ, చిడివలస, డాలింగ్ పుట్టు, రంజని వలస గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా నెలకొందన్నారు. దీంతో ఆయా గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన పేర్కొన్నారు.తాను సర్పంచ్ గా ఉన్నప్పుడు గ్రామాలకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం బోర్లు, పైపులైన్లు, ట్యాంకులు మరమ్మతులకు గురవడంతో గిరిజన ప్రజలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఒక పక్క వేసవికాలం సమీపిస్తుండటంతో గ్రామాలకు సమీపంలో ఉన్న ఊటగెడ్డలు సైతం అట్టడుగుకు ఇంకిపోతు న్నాయని, తక్షణమే ప్రజాప్రతినిధులుచ అధికారులు చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే మండల కేంద్రంలోరి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద గిరిజనులతో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న గిరిజనులు

కాఫీ బకాయిలపై పోరాటం

ప్రజాశక్తి-పాడేరు : కాఫీ రైతులకు ప్రోత్సాహక బకాయి సొమ్ము ఇచ్చేంత వరకు ఐటిడిఏ అధికారులను వదల బోమని, ఇందుకు పోరాటం కొనసాగిస్తామని గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. చింతపల్లి మండలం కాఫీ రైతులతో సమావేశాన్ని సాగిన చిరంజీవి అధ్యక్షతన గిరిజన సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, 2014 నుండి 21 వరకు సుమారు 70 కోట్ల ప్రోత్సాహక నిధులు 47 వేల మంది కాఫీ రైతులకు ఇవ్వాల్సి ఉందన్నారు. ఐటిడిఏ అధికారుల నిర్లక్ష్యంతో ఇంతవరకు ఇవ్వలేదన్నారు. కాఫీ రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఐటిడిఏ అధికారులు నిలువునా దోపిడిదారులుగా తయారయ్యారని మండిపడ్డార. రైతులకు రావలసిన ప్రోత్సాహకాలు ఇస్తారా ఐటీడీఏకు కాఫీ రైతులను రమ్మంటారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనంజయ్, కాఫీ రైతుల సంఘం నాయకులు కే.సోమలింగం, గెమ్మెలి లక్ష్మయ్య, కాకరి సత్తిబాబు, కోర్ర మోహన్‌రావు, కాఫీ రైతులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

అంగన్‌వాడీల నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సిఐటియు మండల కార్యదర్శి కె శంకర్‌రావు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు తక్షణమే నెర వేర్చాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకండా పని బారం పెంచిందన్నారు. మొబైల్ యాప్లులతో మరింత ఒత్తిడి తీసుకు వస్తున్నారని మండిపడ్డారు. సమాన పనికి సమాన వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, టిఎ, డిఎలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీ లను కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు.ప్రభుత్వ అధికారుల వేదింపులు ఆపి, మొబైల్ ఫేషియల్ అటెండెన్స్ ఎత్తివేయాలన్నారు.ఫిబ్రవరి 6న చలో పాడేరు జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేపట్టేందుకు కార్మికులు ఏకం కావాలని కోరారు. తఈ కార్యక్రమంలో గిరిజన సంఘం సంఘం మండల కార్యదర్శి ఎంఎం శ్రీను, లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్, పి.బిమ్మన, సిఐటియు మండల కమిటీ సభ్యులు పి.బీమరాజు అంగన్వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న విద్యార్థులు

అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలి

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని సలుగు పంచాయతీ ఈదులపాలెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుడిని నియమించాలని ఏడవ వార్డు సభ్యుడు, సిపిఎం మండల కమిటీ సభ్యుడు మామిడి రాజారావు తెలిపారు. అధికారుల అలసత్వంపై సోమవారం ఉదయం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పాఠశాలలో 44 మంది పిల్లలు చదువుతున్నారని వీరిలో ఒకటో తరగతిలో పదిమంది, రెండో తరగతిలో 15, మూడవ తరగతిలో ఆరుగురు, నాలుగో తరగతిలో ఆరుగురు, ఐదో తరగతిలో 9 మంది విద్య నభ్యసిస్తున్నారని తెలిపారు. అన్ని తరగతులలో కలిపి 44 మంది విద్యార్థులకు బోధించడానికి ఒక ఉపాధ్యాయుడు మాత్రమే ఉన్నారని, దీంతో పిల్లలకి అన్ని సబ్జెక్ట్స్ పూర్తిగా చెప్పలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధ్యాయుని కొరతతో విద్యాభ్యాసం కుంటు పడుతోందని అదనపు ఉపాధ్యాయుడి నియామకం కోసం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి గోపాలకృష్ణకు గత ఏడాది ఆగస్టు నెలలోనే వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ముగిసిపోతున్నా అధికారులు ఉపాధ్యాయుడి నియామకం పై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. 44 మంది పిల్లలు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని అధికారులకు తెలిసినప్పటికీ ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, రైతు నాయకులు

ప్రజాశక్తి -విఆర్.పురం

మండలంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ మండల కేంద్రం రేఖపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎన్.శ్రీధర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి వడ్లాది రమేష్ మాట్లాడుతూ టార్గెట్ పూర్తయిందని చెప్పి ధాన్యం కొనుగోలు నిలిపి వేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిలిపివేయడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్‌లు పూనెం సరోజినీ, కారం బుచ్చమ్మ, సవలం మారయ్య, వెట్టి లక్ష్మి, గిరిజన నాయకులు పులి సంతోష్ కుమార్, పూనెం ప్రదీప్ కుమార్, రైతు సంఘం నాయకులు కారం సత్తిబాబు, తాతబాబు, గుటాల శ్రీను, పులి బుజ్జి, వి.రమేష్, పులి ధర్మరాజు, సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, పోడియం శ్రీరామూర్తి, పులి చంద్రరావు, గుండుపూడి లక్ష్మణరావు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి : సిపిఎం

చింతూరు : రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా తక్షణమే వరి ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని, లేనిపక్షంలో రైతులతో ఆందోళన దిగుతామని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ హెచ్చరించారు. సోమవారం సిపిఎం బృందం తుమ్మల సచివాలయం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వారి వెళ్లే సమయానికి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఎవరూ లేకపోగా, రైతులు తీసుకొచ్చిన 500 ధాన్యం బస్తాలు బహిరంగ ప్రదేశంలో ఉండగా, వాటిని పశువుల మేత మేస్తూ కనిపించాయి. ఈ సందర్భంగా సీసం సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి రైతులకు మద్దతు ధర ఇస్తామని నమ్మబలికి, నేడు కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుంజ సీతారామయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ముర్రం రంగమ్మ, మొట్టమ రాజయ్య పాల్గొన్నారు.

కొనుగోలు చేయకుంటే ఆందోళన

- సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

రాజవొమ్మంగి : ప్రభుత్వం రైతుల నుండి ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం రాజవొమ్మంగి ప్రజా సంఘాలు కార్యాలయంలో జరిగిన సిపిఎం మండల కమిటీ, శాఖ కార్యదర్శలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు మద్యంతరంగా నిలిపివేయడం సరికాదని, ఇంకా అనేకమంది రైతులు ధాన్యం నిల్వలు చేసుకుని ఉన్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూనికల్లో లోపాలను గుర్తించడం జరిగిందని, రైతుల తెచ్చిన ధాన్యానికి తరుగుకు సంబంధం లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎంగా రైతులతో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మేలిన రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు, మండల నాయకులు కొండ్ల సూరిబాబు, కోసూరి అప్పలరాజు, కె దొరబాబు, టి శ్రీను, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ఎపి జెన్‌కో ఇఇగా ప్రభాకర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు

ఏపీ జెన్కో సీలేరు కాంప్లెక్స్ పరిధిని సివిల్ విభాగం నూతన ఈఈగా జి.ప్రభాకర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభాకర్ పోలవరం ప్రాజెక్టులో మూడు సంవత్సరాలు ఈఈగా విధులు నిర్వహించారు. ఏపీ జెన్కో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఈఈగా సీలేరులో సివిల్ విభాగంలో బాధ్యతలు చేపట్టారు. 2020 జూలైలో ఏపీ జెన్కో ఈఈగా జాకీర్ హుస్సేన్ సీలేరులో బాధ్యతలు చేపట్టి రెండున్నర సంవత్సరాలు పాటు విధుల్లో కొనసాగారు. ఆయన్ను నెల్లూరు జిల్లా కృష్ణపట్నం దామోదర సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఏపీ జెన్కో ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా సివిల్ భాగంలో ఈఈగా బాధ్యతలు చేపట్టిన ప్రభాకర్‌కు ఏడిఈ క్యాంపు అప్పలనాయుడు, ఏఈ రమేష్, ఏఈ టెక్నికల్ కె.పావని తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రభాకర్

వలస ఆదివాసీల సమస్యలను పరిష్కరించాలి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు, వలస ఆదివాసీలు

ప్రజాశక్తి -ఎటపాక : విస్సాపురం మండల ప్రాదేశిక పరిధిలోని తొమ్మిది వలస ఆదివాసీ గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో విస్సాపురం సచివాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. వలస ఆదివాసీలకు రేషన్ కార్డులు మంజూరు చేసి అందుబాటులో రేషన్ డిపో ఏర్పాటు చేసి దాని ద్వారా ప్రభుత్వ నిత్యావసరాలను అందించాలని కోరారు. అలాగే విద్యుత్, పాఠశాల, తాగునీరు, తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. వాలంటీర్లను అందుబాటులోకి తేవాలని కోరుతూ సచివాలయం కార్యదర్శి వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఐవి, పార్టీ మండల నాయకులు డి మాధవరావు, సోంది రామారావు, పి.వెంకన్నబాబు పాల్గొన్నారు.

బదిలీ హెల్త్ అసిస్టెంట్‌కు ఘనవీడ్కోలు

జగన్నాథాన్ని సత్కరిస్తున్న వైద్య ఉద్యోగులు

ప్రజాశక్తి -పాడేరు: మండలంలోని మినుములూరు పిహెచ్‌సి డోకులూరు సచివాలయంలో ఎనిమిదేళ్లుగా కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి, అడుగులపుట్టు సచివాలయానికి బదిలీపై వెళ్తున్న కొర్ర జగన్నాథానికి సోమవారం ఘనవీడ్కోలు పలికారు. సోమవారం గొల్లపల్లి చర్చి వద్ద ఎఎన్ఎం పుష్ప, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణరావు, ఆశ వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వి.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, కష్టపడే తత్వం ఉన్న జగన్నాథం, డోకులూరులో ప్రజలకు మంచి సేవలందించి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. సభకు అధ్యక్షత వహించిన వైద్యఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకుడు శెట్టినాగరాజు మాట్లాడుతూ, జగన్నాథం ప్రజలకు ఎంతమంచి సేవలు అందించారో, స్థానికులు ఆయనకు అందించిన ఘనవీడ్కోలే నిదర్శనమన్నారు. ప్రజలు, ఉద్యోగులతో స్నేహభావంతో ఉంటూ, ఉత్తమమైన వైద్యసేవలు అందించిన జగన్నాథం, కొత్త ప్రదేశంలోనూ మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కురాబోయిన సన్నిబాబు, సిహెచ్‌ఓ అన్నపూర్ణ, హెచ్‌వి, ఎఎన్ఎంలు భాగ్యవతి, బుజ్జి పాల్గొన్నారు.

గడపగడపకూ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సంక్షేమ పథకాల అమలు బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి -జి.మాడుగుల : మండలం బీరం సచివాలయ పరిధిలోని ఆగంపాడు, వనిల్ల, బొడ్డపుట్టు, తుమ్మిదేలనేరేడి, వి.కోడపల్లి, వెంకటపాలెం గ్రామాల్లో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 280 ఇళ్లను సందర్శించి, మూడున్నరేళ్లలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీయడంతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నేతలు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలను సత్వరమే పరిష్కరించండి

స్పందనలో సమస్యలు వింటున్న జెసి, పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - రంపచోడవరం : మారుమూల గ్రామాల నుంచి వచ్చి స్పందనలో దరఖాస్తులిచ్చిన గిరిజనుల వ్యక్తిగత, సామాజిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటిడిఎ రంపచోడవరం పిఒ సూరజ్ గనోరే ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశమందిరంలో రంపచోడవరం సబ్‌కలెక్టర్ శుభం బన్సల్, రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయ ఎపిఒ సిహెచ్ శ్రీనివాసరావుతో కలిసి, స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి 72 దరఖాస్తులను స్వీకరించారు. రంపచోడవరం మండలం రంప గ్రామం నుండి మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామం వరకు గుంతలు పడిన రోడ్డును బాగు చేయించాలని ఎంపిటిసి తూలబందుల లత దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని బొడ్డగండి పంచాయతీ పాలగడ్డ నుండి బొడ్డగండి వరకు రోడ్డు ఏర్పాటు చేయాలని,. ప్రధానమంత్రి ఆదర్శ యోజన గ్రామంగా గుర్తించిన మంగంపాడు గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, అదే గ్రామంలో కొండపోడు వ్యవసాయం చేసుకుంటున్న 58మంది రైతులకు పోడు పట్టాలు మంజూరు చేయాలని సారంకోట అబ్బాయిరెడ్డి దరఖాస్తు సమర్పించారు. వై.రామవరం మండలం చవిటి దిబ్బలులో తన పొలంలో బోరు పాయింట్ వేసినా, నేటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని గేదెల అబ్బాయి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం భారంగి గ్రామంలో భూసమస్య పరిష్కరించాలని కంగాల చెలయమ్మ. కంగాల బాపిరాజు. కంగాల జోగామ్మ దరఖాస్తు సమర్పించారు. అడ్డతీగల మండలంలోని రాయిగూడెం గ్రామంలో 21/4, 26/281 సర్వేనెంబర్లలోని భూముల సమస్యలు పరిష్కరించాలని ముర్రం గంగన్నదొర. ముర్రం రాంబాబు దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలంలోని ఆకూరు, వేములకొండ, తున్నూరు గ్రామపంచాయతీల పరిధిలోని గ్రామాలలో నేషనల్ పార్క్ సంబంధించిన హద్దులు నిర్ధారణకు గ్రామసభా ఏర్పాటు చేయాలని ఆకూర్ సర్పంచ్ కొమరం పండు దొర, ఎంపిటిసీ నర్రి పాపారావు అరీజ సమర్పించారు. ఇఇలు జి. డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, ఎపిడి ఎ.శ్రీనివాసరావు. డిఎల్‌డిఒ కె. కోటేశ్వరరావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన, వెటర్నరీ డాక్టర్ గోపిక , జిసిసి డివిజనల్ మేనేజర్ పార్వతీశ్వరరావు, మలేరియా అధికారి రామకృష్ణ, సిడిపిఒ సంధ్యారాణి, డిఇఇలు రంగనాథ్, ఎ.శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, రాజేంద్రబాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి రాంబాబు, ఎడిఎ సిహెచ్‌కెవి చౌదరి, ఎంపిడిఒ ఎంవి.ర్ కుమార్‌బాబు, గిరిజన సంక్షేమ శాఖ డిడి కార్యాలయ సూపరింటెండెంట్ బి. కిషోర్, డివిజినల్ సివిల్ సప్లై అధికారి, సి.శ్రీహరి. డిప్యూటీ తహశీల్దార్, తాతారావు, చైతన్య బాబు, విశ్వనాథం, యం.సావిత్రి, ఎస్ఒ కబోది. మత్స్య శాఖ అధికారి రమేష్ పాల్గొన్నారు,

ప్రజా ఉద్యమాలను అణచివేయాలని చూస్తే పోరాటం ఉధృతం

జిఒ 1 రద్దు చేయాల్సిందే..!

▸▸ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స

▸▸ కళ్లకు నలుపు గంతలు కట్టుకుని గాంధీ విగ్రహం వద్ద నిరసన

గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అప్పలనర్స, గిరిజనులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ప్రజా ఉద్యమాలను అణిచివేయాలన్న దుర్బుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ1ని తక్షణమే రద్దు చేయాలని గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. సోమవారం అరకులోయ మ్యూజియం వద్ద మహాత్ముని వర్ధంతిని పురస్కరించుకుని, గాంధీజీ. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జిఒ1 రద్దు చేయాలని నిరసనగా కళ్లకు నల్లబ్యాడీలను కట్టుకుని నిరసన చేపట్టారు

ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ కార్యవర్గసభ్యుడు పి అప్పలనర్స మాట్లాడుతూ 1861లో బ్రిటీషర్లు అమలు చేసిన పోలీస్ చట్టాన్ని ఇపుడు రాష్ట్రంలో అమలు చేయాలని జిఒ 1 జారీ చేయడం సిఎం జగన్, వైసిపి ప్రభుత్వ నిరంకుశ విధానానికి నిదర్శనమన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అణిచివేయడానికి లేనిపోని చట్టాలు,జిఒలను జారీ చేసి ప్రజలను భయపెట్టాలనుకోవడం దుర్మార్గమన్నారు.

ఏజెన్సీలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణం, జిఒ3 రద్దు, గిరిజన హక్కులు, చట్టాల ఉల్లంఘనపై ప్రజా ఉద్యమాలు తీవ్రమౌతున్న పరిస్థితుల్లో వాటిని అణచివేయడానికి, లేదంటే పక్కదారి పట్టించడానికి, లేనిపోని ఆంక్షలు, అరెస్టులు, నిర్బంధాలను ప్రయోగిస్తూ, నాటి బ్రిటిష్ పాలకులను తలదన్నేలా ప్రజావ్యతిరేక పరిపాలనను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాల కల్పన వంటి డిమాండ్ల సాధనకు ఉద్యోగ, కార్మికుల ఉద్యమాలను జిఒ1తో అడ్డుకోవాలని చూస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్, గిరిజన మ్యూజియం యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు రాజు, రాంబాబు, కన్నమ్మ, లక్ష్మీ రంభ, రాజు పాల్గొన్నారు

పెండింగ్‌లో ఉన్న రోడ్లకు సత్వరమే అటవీ అనుమతులు

- జిల్లా కలక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు : పాడేరు డివిజన్‌లో పలు రోడ్ల నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న అటవీ అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి పనులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలక్టర్ చాంబర్‌లో అటవీ, ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, ఎన్.ఆర్.పురం, గదిలలోవ, గుమ్మకోట, గాలిపాడు మధ్య సుమారు 20 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మాణానికి 17 కిలోమీటర్ల వరకు అటవీ అనుమతులు అవసరమన్నారు. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను వ్యక్తిగతంగా పర్యవేక్షించి అనుమతులు తెప్పించాలని ఇఇ లావణ్య కుమార్‌ను ఆదేశించారు. అదేవిధంగా పుట్లకోట, పాముర్తె రోడ్డు, సిరిబల రోడ్డు నుండి బొనంపల్లి మీదుగా ప. కొత్తూరు రోడ్డుకు సంబంధించి సైన్సు అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. చింతపల్లి, పాడేరు, నర్సీపట్నం డివిజినల్ ఫారెస్ట్ అధికారుల ఫరిధిలో ఉన్న మిగిలిన రోడ్లను కూడా సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి తగు అనుమతులు వారంలోగా జారీ చేయాలని ఆదేశించారు. అనంతగిరి, హుకుంపేట, పెదబయలు, ముంచింగిపుట్టు మండలాలల్లో 15 రోడ్ల అభివృద్ధికి జాయింట్ ఇన్స్పెక్షన్ చేయాలని, ఫిబ్రవరి 10వ తేదీన జిల్లా స్థాయి కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డివిజనల్ ఫారెస్ట్ అధికారి వినోద్ కుమార్, కార్య నిర్వాహక ఇంజినీర్లు లావణ్య కుమార్, డి వి ఆర్ ఎం రాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యంతో ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట

పాడేరు : మెరుగైన వైద్యసేవలు అందించి ప్రసూతి మరణాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రసూతి మరణాల పర్యవేక్షణ, స్పందన కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రసూతి మరణాలపై పిహెచ్‌సి వైద్యాధికారులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ తప్పిదం వలన ప్రసూతి మరణానికి ఆస్కారమివ్వరాదన్నారు. గర్భిణులు ఆరోగ్యచరిత్ర తెలుసుకుని, హైరిస్క్ ఉన్నవారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అంగన్వాడీలు, ఆశా కార్యకర్తలపై ఆధార పడకుండా, గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు. వీరిని డెలివరీ తేదీకి పదిరోజులు ముందుగానే బర్త్ వెయిటింగ్ హోమ్‌లకు తరలించి, సుఖ ప్రసవం జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గర్భిణులకు [illegible] సేవలపై ఆరా తీశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించాలని ఆదేశించారు సమావేశానికి గైర్హాజరైన అంగన్వాడీ సూపర్‌వైజర్ సత్య సుజాత, గుదలంవీధి అంగన్వాడీ కార్యకర్తకు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మిని ఆదేశించారు. ఆసుపత్రి అభివృద్ధి నిధులు సక్రమంగా వినియోగించి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అంబులెన్సుల ఆయిల్‌కు రూ.ఐదువేలు ఇస్తామన్నారు.సమావేశంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ జమాల్ భాషా, ఎడిఎంహెచ్‌ఒ డాక్టర్ లీలాప్రసాద్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరప్రసాద్ పాల్గొన్నారు.

2,990 మందికి చేదోడు లబ్ధి

జిల్లాలో 2,990 మంది రజక, నాయిబ్రాహ్మణ, దర్జీ లబ్ధిదారులకు జగనన్న చేదోడు పథకం కింద ఒక్కొక్కరికి రూ.పది వేలు చొప్పున రూ.2.99 కోట్ల ఆర్థికసాయం నమూనా చెక్కును జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అందజేశారు. వరుసగా మూడో ఏడాది ఆర్థికసాయం నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, చేదోడు పథకం కింద లబ్ధిపొందిన వారిలో 383 మంది రజక, 252 మంది నాయీబ్రాహ్మణ, 2,355 మంది దర్జీ లబ్ధిదారులున్నారన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు మాట్లాడుతూ వరుసగా మూడో ఏడాది తమ వృత్తులకు రూ.పదివేలు చొప్పున పెట్టుబడిసాయం అందించిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, బిసి కార్పోరేషన్ ఎఇఒ శంకరరావు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీ సర్వేపై ప్రత్యేక దృష్టి

పాడేరు టౌన్: సమగ్ర భూ రీ సర్వేపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పక్కాగా సర్వే చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష సర్వేపై సబ్ కలెక్టర్లు, ఐటిడిఎ పిఒలు, 22 మండలాల తాహశీల్దారులతో భూముల రీసర్వేపై కలెక్టర్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విఆర్ఒలు, గ్రామ సర్వేయర్‌లు డేటా నమోదు వేగంగా చేయాలన్నారు. ఫిబ్రవరి 7వ తేదీలోపు వంద గ్రామాల్లో డేటా ఎంట్రీ పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వే డేటా సేకరణ, మ్యుటేషన్లపై తాహశీల్దారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేసారు. డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన కంప్యూటర్‌లు, స్టేషనరీ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. డిజిపిఎస్ సర్వేతో పాటు, ల్యాండ్ రికార్డులను నవీకరించాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాలతో మ్యుటేషన్లను జాప్యం చేయకూడదన్నారు. రైతులను మ్యుటేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిప్పితే ఉపేక్షించేది లేదన్నారు. వచ్చేనెల 30వ తేదీ నాటికి మ్యుటేషన్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భూముల రికార్డులు ప్యూరిఫికేషన్ చేసిన తరువాత 9(2) నోటీస్ ఇచ్చి గ్రామ సభలు నిర్వహించాలని స్పష్టం చేసారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పివిటిజి ఓటర్ల గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. జెసి జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, రంపచోడవరం పిఒ సూరజ్ గనోరే ఎడి వై.మోహనరావు పాల్గొన్నారు.1

జాతిపితకు ఘన నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ 72వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పలుచోట్ల జాతిపిత విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ప్రజాశక్తి - పాడేరు టౌన్: ఐటిడిఎ కార్యాలయ సమావేశ మందిరంలో గాంధీజీ చిత్రపటానికి ఐటిడిఎ పిఒ రోణంకి గోపాల కృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అహింసే ఆయుధంగా, బ్రిటీషర్లపై పోరాటం చేసి, భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించడంలో గాంధీజీ కృషిని కొనియాడారు. ఐటిడిఎ పరిపాలనా ధికారి హేమలత, డిపిఒ కొండలరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ పి.లీలాకృష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని కోసంగుడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు విలియం కేరి ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు గాంధీజీతోపాటు స్వాతంత్ర్య సమరయోధులు, ముఖ్యనేతల జీవిత చరిత్రను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. గాంధీజీ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

డుంబ్రిగుడలో..

సీలేరు: సీలేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత కారే శ్రీనివాస్ కార్యకర్తలు చెల్లు శ్యామ్‌సన్, వర్తక సంఘం అధ్యక్షులు సిద్ధు, సీలేరు క్రీడాకారుడు జాన్‌బాబు, ఎం.రమణ ఎపి జెన్‌కో కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు లక్ష్మణ్, వైసిపి కార్యకర్తలు, ఎస్‌సి అసోసియేషన్ నాయకులు బాలకోటయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని తామరపల్లి సచివాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎంపిటిసి వంశీ కుంజం, సర్పంచ్ మిర్తివాడ ఆనంద్ రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముసురిమిల్లి వార్డు సభ్యులు ప్రసాద్, చిట్టిదొర, వైసిపి నేతలు వి.వెంకన్న, సెక్రటరీ కృష్ణమోహన్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు

రాజవొమ్మంగి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి ఎంపిపి గోము వెంకటలక్ష్మి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ జయంతి, వెలుగు ఎపిఎం ఆదినారాయణ, వెలుగు సిసిలు, కార్యాలయ సిబ్బంది, ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరులో గాంధీకి నివాళులర్పిస్తున్న పిఒ గోపాలకృష్ణ

రంపచోడవరంలో...

రాజవొమ్మంగిలో..

సీలేరులో...

స్వచ్ఛందంగా నీటి ట్యాంకు శుభ్రత

మంచినీటి ట్యాంక్ శుభ్రపరుస్తున్న చినబూరుగుపుట్టు మహిళలు

ప్రజాశక్తి - హుకుంపేట: మండలంలోని సంతారి పంచాయతీ చినబూరుగుపుట్టు మహిళలు ఆరోగ్య విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే సురక్షిత మంచినీరు తాగడం కూడా ఒక మార్గమని గుర్తించిన వారంతా గ్రామంలోని మంచినీటి ట్యాంకును నెలకోసారి రెగ్యులర్ గా శుభ్రపరుస్తు ంటారు. ఇందులో భాగంగానే సోమ వారం గ్రామంలోని 50 కుటుంబాల నీటి అవసరాలను తీర్చే ఏకైక నీటిట్యాంకును శుభ్రపరించారు. సిహెచ్‌డబ్ల్యు కె.పుష్పవతి ఆధ్వర్యంలో మహిళలందరూ సమిష్టిగా ముందుకొచ్చి మంచినీటి ట్యాంకును కడిగారు. ఇలా ప్రతినెలా చేయడం వల్ల కలుషిత నీటి సమస్యను అధిగమించి, కొన్ని వ్యాధులైనా దరిచేరకుండా ఉంటాయని వీరంతా అంటున్నారు. చినబూరుగుపుట్టు మహిళల్లో ఈ చైతన్యం, అవగాహన పలువురికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అంటున్నారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ కాసులమ్మ, వాలంటీర్ లక్ష్మణ్, నూకరాజు, రాంబాబు, సింహాచలం, సుధాకర్, వెంకటరమణ, గ్రామ మహిళలు జయప్రభ, కృష్ణవేణి, మిరాజ, చెల్లమ్మ, గంగ, జ్యోతి, కొండమ్మ, భీములమ్మ, పద్మ, భాగ్య, దుర్గమ్మ, చిలకమ్మ పాల్గొన్నారు.

పట్టాలు సరే.. ఇళ్లు నిర్మించేది ఎప్పుడో..?

ఇళ్ల పట్టాలు చూపుతున్న గిరిజనులు. సిపిఎం నేతలు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : జగనన్న గృహనిర్మాణ పథకం కింద పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా పట్టాలు ఇచ్చినా, ఇళ్లను ఎపుడు నిర్మించి ఇస్తారని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు ప్రశ్నించారు. సోమవారం అరకువేలి మండలం బస్కి పంచాయతీ కంజరితోట, కొంత్రాయిగూడ గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో తాగునీరు, సిసి రోడ్లు, మురుగుకాలువలు, ఇళ్ల నిర్మాణాలు వంటి పలు సమస్యలను స్థానికులు సిపిఎం బృందం దృష్టికి తెచ్చారు.

ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామన్న హామీ మూడున్నరేళ్లు దాటినా నేటికీ అమలు నోచుకోవడం లేదన్నారు. ఇళ్లస్థలాలు, పట్టాలతో హడావిడి చేస్తున్నారే తప్ప, త్వరితగతిన ఇళ్ల నిర్మాణంపై అటు ప్రభుత్వంగానీ, ఇటు అధికారులుగానీ చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్నారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే, సొంతింటి నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయని ప్రశ్నించారు.

కొంత్రాయిగూడ, కంజరీతోట గ్రామాల్లో ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారని, సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర వైద్యానికి డోలిమోతలే శరణ్యమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని గతంలో దరఖాస్తు చేసినప్పటికీ, నేటికీ అనేక మంది అర్హులైన వారికి భూయాజమాన్య హక్కు పట్టాలు అందలేదన్నారు. అధిక కరెంటు బిల్లులు, ఇతరత్రా సాంకేతిక కారణాలు చూపుతూ ఎందరో పేదల పింఛన్లను ప్రభుత్వం రద్దుచేయడం దారుణమని, తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సింహాద్రి, గాంధీ, రాంబాబు, సమర్ది బాబురావు, కన్నయ్య, రామచందర్, సీతారాం, నవీన్, సోములు, అప్పలరాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ,

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఏజెన్సీలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయం సమావేశ మందిరంలో, పిఆర్, ఆర్ డబ్ల్యూఎస్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి, మార్చి నెలలో తాగునీటి సమస్యలు అధికంగా ఉంటాయని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం, మండల స్థాయిలోను, గ్రామ పంచాయతీలలో ప్రత్యేకంగా తాగునీటి పథకాల సమస్యల పర్యవేక్షణకు మరమ్మతులు చేయడానికి మెకానిక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. బోరు బావుల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలపైనే ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం ఎఇ మండల స్థాయిలోను గ్రామ సచివాలయం స్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తాగునీటి పథకాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. బోర్ల వద్ద దుస్తులు ఉతక కుండా సర్పంచులతో అవగాహన కల్పించాలని చెప్పారు. తాగునీటి పథకాలను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని పేర్కొన్నారు. సోలార్ తాగునీటి పథకాలు, గ్రావిటీ పథకాలు, బోర్లు వినియోగంలోకి రావాలన్నారు. జల్ జీవన్ మిషన్‌లో మంజూరు చేసిన పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇఇ పి.లీలాక్రిష్ణ, డిపిఒ కొండలరావు, డిఎల్‌పిఒ పిఎస్ కుమార్, 11 మండలాల డిఇలు, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన

బిందుశ్రీని అభినందిస్తున్న హెచ్ఎం

ప్రజాశక్తి -జి.మాడుగుల : మోదమాంబ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ మోడల్ పరీక్షలో 75 మార్కులు సాధించి ఫస్ట్ ర్యాంక్, గోల్డ్ మెడల్ సాధించిన నాడేల బిందుశ్రీని సోమవారం అభినందిచారు.

జి.మాడుగుల ఎంపిపి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న నాడేలి బిందుశ్రీ, నవోదయ నమూనా పరీక్షలో మంచి ప్రతిభ కనబరచడంపై పాఠశాల హెచ్ఎం శ్యాంసుందర్ ఆమెను అభినందించారు. భవిష్యత్తులో ఇలాగే అన్ని పరీక్షల్లోనూ మంచి ప్రతభ చూపుతూ ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులు, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బిందుశ్రీ తల్లిదండ్రులు పాల్గొన్నారు